అద్దె పనిముట్లతో రైతులకు మేలు

కోహీర్, ఫిబ్రవరి 15: అద్దె పనిముట్లతో రైతులకు మేలు జరుగుతుందని ఐకేపీ ఏపీఎం సమ్మయ్య తెలిపారు. గురువారం కోహీర్ పట్టణంలోని పేదరిక నిర్మూలన సంస్థ కార్యాలయంలో నేలతల్లి ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ బోర్డు సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. భూమి దున్నడానికి ఇనుప నాగళ్లు, మందులు పిచికారీ, విత్తనం నాటేందుకు కూడా పనిముట్ల అందుబాటులో ఉన్నాయని వివరించారు.

తక్కువ ధరకే అద్దె పనిముట్లను అందజేస్తామని రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అద్దె పనిముట్ల గురించి మండలంలోని ఆయా గ్రామా ల చిన్న, సన్నకారు రైతులకు తెలుపాలని కోరారు. సమావేశంలో బోర్డుసభ్యులు పాల్గొన్నారు.

నక్క రోడ్డును కాపాడాలి

హత్నూర, ఫిబ్రవరి15: కబ్జాకు గురవుతున్న నక్క రోడ్డును కాపాడాలని కోరుతూ హత్నూర తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. హత్నూర మండలం కాసాల శివారులోని సర్వేనెంబర్ 326/ఆ/2 నుంచి దశాబ్దాల కాలంగా ప్రజలు నడిచేందుకు నక్క రోడ్డు వుంది. ప్రస్తుతం భూముల ధరలకు రెక్కలు రావడంతో కొందరు వ్యక్తులు నక్క రోడ్డును తొలిగించి అడ్డంగా సిమెంటు పలకలు ఏర్పాటు చేశారు. దీంతో నక్కరోడ్డును కాపాడాలని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపించారు.

నక్క రోడ్డును మూసివేస్తూ ఏర్పాటు చేసిన సిమెంటు బ్రిక్స్

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

న్యాల్‌కల్, ఫిబ్రవరి 15: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం మండలంలోని రుక్మాపూర్ గ్రామ శివారులో చోటుచేసుకుంది. హద్నూర్ ఎస్ఐ రామానాయు డు కథనం ప్రకారం.. జహీరాబాద్ మండలం బుర్దీపాడ్‌కు చెందిన అనిల్‌కుమార్(37) కొంతకాలంగా జహీరాబాద్‌లో ఉంటున్నాడు. ఝరాసంగం మండలం మచ్నూర్‌కు చెందిన సమీప బంధువుతో కలిసి మద్యం తాగాడు. గురువారం తెల్లవారుజామున రుక్మాపూర్ శివారులో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు.

100కు ఫోన్ రావడంతో పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. వ్యక్తి మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతి చెందిన వ్యక్తికి ఎలాంటి గాయాలు లేవని, మద్యం తాగి మృతిచెంది ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ట్టు ఎస్ఐ పేర్కొన్నారు.

బాధితులకు ఉచితంగా న్యాయ సేవా సహకారాలు

హత్నూర, ఫిబ్రవరి 15: పలు విషయాల్లో న్యాయం కోసం పోరాటం చేస్తున్న వారికి జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచిత న్యాయ సేవా సహకారాలు అందిస్తామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జి హన్మంతరావు తెలిపారు. గురువారం తనకు రావాల్సిన వాటా భూమిని రాకుండా చేశారని ఆవేదనవ్యక్తం చేస్తూ ఓ బాధితురాలు హత్నూర తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టగా పలు దినపత్రికల్లో వార్తాకథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ప్రభాకర్‌రావు ఆదేశాలతో బాధిత మహిళతో చర్చించినట్లు తెలిపారు. బాధిత మహిళ నుంచి పూర్తి వివరాలు సేకరించి దరఖాస్తు తీసుకొని ఉచితంగా న్యాయసేవలు అందించి న్యాయం జరిగేలా కృషి చేస్తామని తెలిపారు.

న్యాయం చేయాలని కోరుతూ సీనియర్ సివిల్ జడ్జి హన్మంతరావుకు దరఖాస్తు చేస్తున్న బాధిత మహిళ

విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 15 : తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) ద్వారా కళాశాల విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందిస్తున్నామని తారా ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్ పేర్కొన్నారు. గురువారం కళాశాలలో క్యాంపస్ టు కార్పొరేట్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టాస్క్ నైపుణ్యాభివృద్ధి శిక్షణతో ఎంతోమంది విద్యార్థులు సాఫ్ట్‌వేర్ రంగంలో రాణిస్తున్నారని తెలిపారు. నిష్ణాతులైన టాస్క్ శిక్షకులతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు పొందడానికి కావాల్సిన అర్హతలు ఎలా పెంపొందించుకోవాలో, నైపుణ్యాలను ఎలా అలవర్చుకోవాలో అనే అంశాలపై శిక్షణ ఇచ్చారని చెప్పారు. ఇంటర్వ్యూ స్కిల్స్, గ్రూప్ డిస్కషన్స్ తదితర స్కిల్స్‌పై అవగాహన కల్పించారన్నారు. అనంతరం 152మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో టాస్క్ ట్రైనర్ అబ్దుల్ ముఖీద్, టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ ఏవీశర్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ అందజేస్తున్న అబ్దుల్ ముఖీద్, టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ ఏవీ శర్మ

మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి

సంగారెడ్డి, ఫిబ్రవరి15: నైపుణ్యం కలిగి, పనిని పట్టుదలతో చేస్తే మహిళలు పెద్ద వ్యాపారవేత్తలుగా ఎదగొచ్చని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి జ్యోతి అన్నారు.

గురువారం పట్టణంలోని మండల సమాఖ్య కార్యాలయంలో పీఎంఎఫ్ఎంఈతో సీడ్ కాపిటల్ పొందిన 45మంది మహిళా సంఘాల సభ్యుల శిక్షణకు డీఆర్డీవో హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మ హిళా సంఘాల సభ్యులు పట్టుదలతో పనిని ప్రారంభిస్తే సాధించే వరకు వదిలిపెట్టరని, వారికి ప్రోత్స హం ఉంటే చాలు ఏ పనినైనా సులభంగా సాధిస్తారన్నారు. అందుకు కావాల్సిన నిధులు ఇవ్వడానికి బ్యాంకులు సిద్ధంగా ఉన్నాయన్నారు.

దీని కోసం జిల్లాలోని సెర్ప్ ఉద్యోగులు, వీవోఏలు చురుకుగా పని చేస్తున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో అదనపు డీఆర్డీవో భీమయ్య, డీపీఎంలు రవీందర్, శ్రీనివాస్, ఏపీఎంలు వెంకట్, సమత, సత్యనారాయణ, సౌజన్య, శిక్షకులు, సీసీలు, వీవోఏలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఆర్డీవో జ్యోతి

నేటి నుంచి న్యాల్‌కల్‌లో ఉర్సు

న్యాల్‌కల్, ఫిబ్రవరి 15: జిల్లాలోనే పేరుగాంచిన హజరత్ పీర్‌గైబ్ సాహెబ్ దర్గా అందరికీ ఆరాధ్యదైవంగా వెలుగొందుతోంది. కుల మతాలకు అతీతంగా వేలాది మంది భక్తులు తరలివచ్చి దర్గాను దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. న్యాల్‌కల్ గ్రామ శివారులో ప్రశాంత వాతావరణంలో ఉర్సే షరీఫ్ హజ్రత్ ఫీర్‌గైబ్ సాహెబ్ ఖిబ్లా దర్గా నెలకొని ఉంది. ఈనెల 16వ తేదీ నుంచి 23 వరకు ఉత్సవాలు వైభవంగా జరగనున్నాయి. దర్గాను దర్శించుకునేందుకు జిల్లా నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలకు చెందిన భక్తులు తరలిరానున్నారు. ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉర్సు నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో తాగునీరు, వాహనాల పార్కింగ్, వ్యాపార దుకాణాదారుల కోసం విద్యుత్ తదితర సౌకర్యాలన్నీ సిద్ధం చేశారు. 16న న్యాల్‌కల్ గ్రామానికి చెందిన మాలిపటేల్ ఇంటి నుంచి దర్గాకు సర్కారీ గంధం ఊరేగింపు, 17న కూరగాయల సంత, రాయికోడ్, న్యాల్‌కల్, ఝరాసంగం మండలాల నుంచి దర్గాకు గంధం ఊరేగింపు, 18న పశువుల సంత, గ్రామానికి చెందిన అడివప్ప, గిరిజనుల జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు ఉత్తమ పశుపోషణదారులకు బహుమతులు ప్రదానం, హద్నూర్ గ్రామం నుంచి గంధం ఊరేగింపు, 19న న్యాల్‌కల్ గ్రామానికి చెందిన ఖురేషీల ఆధ్వర్యంలో గంధం ఊరేగింపు, 20న అంతర్రాష్ట్ర కుస్తీపోటీలు, 21న కూరగాయల సంత, 22 దర్గా ఆవరణలో ఖవ్వాలి, 23న ఉత్సవాల ముగింపు, భక్తులకు తీర్థప్రసాదాల వితరణ తదితర కార్యక్రమాలు జరగనున్నాయి.

ఉర్సులో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుం డా జహీరాబాద్ రూరల్ సీఐ వెంకటేశ్, హ ద్నూర్ ఎస్ఐ రామానాయుడు పర్యవేక్షణలో పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయనున్నారు.

న్యాల్‌కల్ గ్రామ శివారులోని ఉర్సే షరీఫ్ హజ్రత్ ఫీర్‌గైబ్ సాహెబ్ ఖిబ్లా దర్గా

నేడు ఇంటర్ ఇంగ్లీష్ ప్రాక్టికల్స్

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 15: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఆంగ్లం ప్రాక్టికల్ పరీక్షను శుక్రవారం నిర్వహించనున్నట్టు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోవింద్‌రామ్ గురువారం ప్రకటనలో తెలిపారు. ద్వితీయ సంవత్సరంలో ఫెయిలైన విద్యార్థులకు ఈ నెల 17న ఎథిక్స్ పరీక్ష నిర్వహిస్తామన్నారు. 19న మొదటి సంవత్సరం విద్యార్థులకు, ద్వితీయ సంవత్సరం ఫెయిలైన విద్యార్థులకు ఎన్విరాన్‌మెంట్ పరీక్ష ఉం టుందన్నారు. ఆయా పరీక్షలు ఉదయం 10 గంటలకు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయాన్ని ఇంటర్ విద్యార్థులు గమనించాలని కోరారు.

మద్యం తాగి నడిపితే చర్యలు

రాయికోడ్, ఫిబ్రవరి 15 : గ్రామీణ ప్రాంతాల్లో మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ వెంకట్ రెడ్డి అన్నారు. గురువారం రాయికోడ్‌లో మద్యం తాగి వాహనాలు నడిపిన వ్యక్తుల నుపరీక్షలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల ఇతరులకు ఇబ్బందులు కలిగే అవకాశం ఉంటుందన్నారు. గ్రామాల్లోకి కొత్త వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సమావేశంలో సిబ్బంది సంగారెడ్డి, నర్సింహులు, వాసునాయక్ ఉన్నారు.

అనుమతులు ఇవ్వొద్దు

హత్నూర, ఫిబ్రవరి15: పరిశ్రమల్లో అదనపు నిర్మాణాలకు అనుమతులు ఇవ్వొద్దని హత్నూర మండలం బోర్పట్ల గ్రామ ప్రజలు గురువారం పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. ఇప్పటికే గ్రామశివారులోని ఎపిటోరియా యూనిట్-1 పరిశ్రమ విడుదల చేస్తున్న వాయు కాలుష్యం, జల కాలుష్యంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. పరిశ్రమలో అదనపు నిర్మాణాలకు అనుమతులు ఇస్తే ఇక గ్రామంలో నివసించలేని పరిస్థితులు ఎదురవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో భాస్కర్‌రెడ్డి, కమలాకర్, సుధాకర్, పవన్‌కల్యాన్ ఉన్నారు.

తహసీల్దార్‌గా ఫర్హీన్ షేక్

హత్నూర, ఫిబ్రవరి15: హత్నూర తహసీల్దార్‌గా ఫర్హీన్ షేక్ బదిలీపై వచ్చారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన సంధ్య బదిలీపై వెళ్లడంతో ఆమె స్థానంలో నూతన తహసీల్దార్‌గా ఫర్హీన్ షేక్‌ను అధికారులు నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె సంగారెడ్డి నుంచి హత్నూరకు బదిలీపై వచ్చారు.

దొంగను పట్టుకున్న గ్రామస్తులు

పటాన్‌చెరు, ఫిబ్రవరి15: అర్ధరాత్రి పాన్‌డబ్బాలో చోరీకి పాల్పడుతున్న వ్యక్తిని నందిగామ గ్రామస్తులు పట్టుకొని బీడీఎల్ పోలీసులకు అప్పగించారు. గ్రామస్తుల కథనం ప్రకారం... పటాన్‌చెరు మండలం నందిగామలో వారంరోజులుగా వరుస చోరీలు జరుగుతున్నాయి. గ్రామస్తులు గస్తీకాయాలని నిర్ణయించుకొని కాపాలాకాస్తున్నారు. బుధవారం అర్ధరాత్రి సమయంలో పాన్‌డబ్బాలో చోరీ జరుగుతున్నట్లు గమనించి దొంగను పట్టుకొని బీడీఎల్ పోలీసులకు అప్పగించారు. ప్రాథమిక విచారణలో చోరీ చేసిన వ్యక్తిది మణికొండ అని తేలిందన్నారు. బీడీఎల్ పోలీసులు దొంగను విచారిస్తున్నారని, విచారణలో మరికొందరు దొరుకుతారని భావిస్తున్నామన్నారు.

జిన్నారం : పంచాయతీ కార్యాలయంలో సిబ్బందిని సన్మానిస్తున్న గ్రామ నాయకులు

గుమ్మడిదల : బొంతపల్లి పంచాయతీ పాలకవర్గాన్ని సన్మానిస్తున్న ఎంపీపీ సద్ది ప్రవీణావిజయభాస్కర్‌రెడ్డి, ఈవో శ్రీనివాస్‌రెడ్డి

పంచాయతీ సిబ్బందికి సన్మానం

జిన్నారం, ఫిబ్రవరి 15: ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాల్లో పాల్గొన్న జిన్నారం గ్రామ పంచాయతీ సిబ్బందిని గ్రామస్తులు సన్మానించారు. పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని రోడ్లు, పరిసరాలను శుభ్రం చేశారని సిబ్బందిని అభినందించారు. గురువారం పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పంచాయతీ సిబ్బందిని శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంత్‌రెడ్డి, నాయకులు నరేశ్, నరేందర్ గౌడ్, ప్రతాప్ రెడ్డి, కోటేశ్, భాస్కర్, మల్లేశ్ యాదవ్ పాల్గొన్నారు.

బొంతపల్లి పాలకవర్గానికి సన్మానం

గుమ్మడిదల, ఫిబ్రవరి15: బొంతపల్లి పాలకవర్గాన్ని ఎంపీపీ, ఈవో ఘనంగా సన్మానించారు. గురువారం మండలంలోని బొంతపల్లిలో ఎంపీపీ సద్ది ప్రవీణావిజయభాస్కర్‌రెడ్డి, పంచాయతీ ఈవో శ్రీనివాస్‌రెడ్డి మాజీ సర్పంచ్ ఆలేటి నవీనాశ్రీనివాస్‌రెడ్డిని, మాజీ ఉపసర్పంచ్ ఆలేటి సంజీవరెడ్డిని, పాలకవర్గా న్ని శాలువా, పూలదండలతో ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఐదేండ్లలో బొంతపల్లిని మోడల్ పంచాయతీగా, జిల్లాలో ఉత్తమ పంచాయతీగా అవార్డులు రావడానికి కృషిచేసిన పంచాయతీ పాలకవర్గానికి అభినందనలు తెలిపారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

పుల్కల్, ఫిబ్రవరి 15: వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. మండల పరిధిలో సింగూరు ప్రాజెక్టు నిర్మాణం చేపట్టినప్పుడు ఇరిగేషన్ శాఖ అధికారులు వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని ఏర్పాటు చేశారు. ప్రతి ఏడాది స్వామి వారి వార్షికోత్సవాన్ని అధికారులు ఘనంగా నిర్వహిస్తారు. గురువారం నాటికి 37 ఏండ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా నిర్వాహకులు, అధికారులు స్వామివారి కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. వంద జంటలు కల్యాణంలో పాల్గొన్నాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు. రెండురోజులపాటు ఉత్సవాలు కొనసాగుతాయని ఆలయ పూజారి శ్రీనివాసాచార్యులు తెలిపారు.

కనులపండువగా స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి

ఎంపీడీవో శశిప్రభకు స్వాగతం పలుకుతున్న ఎంపీటీసీలు

వట్‌పల్లి, ఫిబ్రవరి 15: గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలని ఎంపీపీ పేర్కొన్నారు. గురువారం మండలంలోని రైతువేదికలో ఎంపీపీ కృష్ణవేణి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న విద్యుత్, నీటి సమస్యలపై పదేపదే సమావేశంలో మాట్లాడటం చాలా బాధాకారంగా ఉందన్నారు. అధికారులు తక్షణమే తగు చర్యలు తీసుకొని సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం నూతనంగా నియమితులైన ఎంపీడీవో శశిప్రభకు ఎంపీటీసీలు వివిధ శాఖల అధికారులు శాలువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ అపర్ణ, ఎమ్మార్వో శ్రీనివాస్, ఎంపీవో యూసుఫ్, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీలు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

రామచంద్రాపురం, ఫిబ్రవరి 15 : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నుంచి 19వ తేదీ వరకు సూర్యాపేట జిల్లాలోని చింతలపాలెంలో జరగనున్న 33వ సబ్‌జూనియర్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన డివిజన్ క్రీడాకారులను ఆమె అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాస్థాయిలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులకు సొంత నిధులతో టీ షర్ట్స్, షూస్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ సర్కిల్ అధ్యక్షుడు పరమేశ్ యాదవ్, జిల్లా కబ డ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ముక్తార్ జానీ, మాజీ అధ్యక్షులు ఎల్లయ్య, నా రాయణ గౌడ్, రాకేశ్, శ్యామ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు టీ షర్ట్స్, షూస్ పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి

ఫ్లెక్సీల వార్

రామచంద్రాపురం, ఫిబ్రవరి15: బహుజన సమాజ్ పార్టీ నాయకుడు నీలం మధు ముదిరాజ్ గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈనేపథ్యంలో ఆయన కాంగ్రెస్‌లో చేరుతున్న సందర్భంగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఆర్సీపురం డివిజన్‌లోని కాంగ్రెస్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో స్థానిక నాయకులైన రాష్ట్ర ఎన్ఎస్‌యూఐ మాజీఅధ్యక్షుడు అవినాశ్‌గౌడ్, డివిజన్ అధ్యక్షుడు ఈశ్వర్‌సింగ్ ఫొటోలు లేకపోవడంతోపాటు నియోజకవర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్ ఫొటోను రెండో లైన్‌లో చిన్నగా పెట్టడంతో పార్టీ కార్యకర్తలు ఆగ్రహించి ఫ్లెక్సీని తొలిగించారు. కాంగ్రెస్‌లోకి చేరడాన్ని తాము తప్పుపట్టడం లేదని, నాయకులను కలుపుకోకుండా ఇష్టానుసారంగా వ్యవహరించడం సరికాదని అభిప్రాయపడుతున్నారు.

సేవాలాల్ గిరిజనుల ఆరాధ్యుడు

భోగ్‌భండార్‌లో పాల్గొన్న బంజారాలు

గిరిజనుల (లంబాడీ) ఆరాధ్యదేవుడు సేవాలాల్ జయంతిని శుక్రవారం జిల్లాలోని గిరిజన తండాల్లో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండలల్లోని గిరిజనతండాల్లో సేవాలాల్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాల వేసి ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు. సేవాలాల్ చిత్రపటానికి క్షీరాభిషేకం, పూజలు చేశారు. అనంతరం భోగ్‌బండార్ నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా ప్రజాప్రతినిధులు, నాయకులు, గిరిజనులు పాల్గొన్నారు.

– సంగారెడ్డి న్యూస్ నెట్‌వర్క్ ఫిబ్రవరి 15



సంగారెడ్డి : భోగ్ భండార్ పూజల్లో పాల్గొన్న అదనపు కలెక్టర్

జిన్నారం: గిరిజన గురుకుల పాఠశాలలో జయంతి

బొల్లారం : సేవాలాల్ మహరాజ్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కార్మిక నాయకులు



వట్‌పల్లి : సేవాలాల్ జయంతి నిర్వహించిన గిరిజన మహిళలు, యువకులు

సేవాలాల్ జయంతి ఉత్సవాల్లో పాల్గొని మాట్లాడుతున్న నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవ్‌రెడ్డి

బాధ్యతలు చేపట్టిన సాయిబాబా

సంగారెడ్డి, ఫిబ్రవరి 15: జిల్లా పంచాయతీ అధికారిగా సాయిబాబా బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహించిన డీపీవో సురేశ్‌మోహన్ వికారాబాద్‌కు బదిలీ అయ్యారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన డీపీవో కలెక్టర్ వల్లూరు క్రాంతిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డీపీవో సాయిబాబాను కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది సహకారంతో జిల్లాను అన్ని రంగాల్లో ముందుంచడానికి కృషి చేస్తానన్నారు.

కలెక్టర్ క్రాంతిని కలిసిన డీపీవో సాయిబాబా

డీఎస్పీగా రామ్మోహన్ రెడ్డి

జహీరాబాద్, ఫిబ్రవరి 15: జహీరాబాద్ డీఎస్పీగా రామ్మోహన్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లో ఎక్సైజ్ శాఖలో డిప్యుటేషన్‌లో పనిచేసిన రామ్మోహన్‌రెడ్డి బదిలీపై జహీరాబాద్‌కు వచ్చారు. ఇక్కడ డీఎస్పీగా పనిచేసిన రఘు హైదరాబాద్‌కు బదిలీపై వెళ్లారు.

బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ కమిషనర్

సంగారెడ్డి, ఫిబ్రవరి15: సంగారెడ్డి గ్రేడ్-1మున్సిపల్ కమిషనర్‌గా ప్రసాద్‌చౌహాన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన కమిషనర్ సుజాత బదిలీపై హైదరాబాద్ పురపాలక శాఖ కమిషనరేట్ కార్యాలయానికి వెళ్లారు. ఆర్మూర్ మున్సిపల్ నుంచి బదిలీపై ప్రసాద్‌చౌహాన్ సంగారెడ్డికి వచ్చారు. బాధ్యతలు చేపట్టిన కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి కౌన్సిలర్లు ఘనస్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. కమిషనర్‌ను కలిసిన వారిలో కౌన్సిలర్లు రాజేందర్‌రెడ్డి, వెంకట్‌రాజు, శ్రీకాంత్, ఉదయ్ భాస్కర్ ఉన్నారు.

కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కౌన్సిలర్లు

మున్సిపల్ కమిషనర్‌గా 'మంగతాయారు'

బొల్లారం, ఫిబ్రవరి 15: బొల్లారం మున్సిపల్ కమిషనర్‌గా మంగతాయారు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన కమిషనర్ సంగారెడ్డి తెల్లాపూర్ మున్సిపాలిటీకి బదిలీ కాగా, ఆయన స్థానంలో జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న మంగతాయారు బొల్లారం కమిషనర్‌గా వచ్చారు. ఈ సందర్భంగా ఆర్వోశ్రీధర్ ఆధ్వర్యంలో కార్యాలయ ఉద్యోగులు సిబ్బంది ఆమెకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ నిర్మల, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్, వార్డు ఆఫీసర్లు, కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కమిషనర్ మంగతాయారుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆర్వో శ్రీధర్, సిబ్బంది

PUBLIC NOTICE

IN THE COURT OF THE HONOURABLE JUNIOR CIVIL JUDGE AT : ZAHEERABAD

O.S.No.191 OF 2021

Between
1. Satyaram Linganna
2. Satyaram Lalithamma
3. Satyaram Laxmaiah
...Petitioners/Plaintiffs
AND
Chandra Shekar
...Respondent/Defendant

To,
Chandra Shekar S/o. Venkatesham,
Aged about 70 Years,
Occ: Retired Army Personnel,
R/o. Mahindra Colony,
Zaheerabad Town and Mandal,
Sangareddy District, Telangana State.

Take notice that Petitioner filed the above suit for Perpetual injunction restraining the against you i.e Defendant before the said Hon'ble court. The case is posted on 29-02-2024. for appearance before the said court on the said date at 10.30 a.m. if anyone has any clam or objection appear before Honourable Junior civil Judge Court At Zahirabad on above said date and time by person or through Advocate. otherwise on the said date and time before the said court the case will be decided as per law.

//BY ORDER OF THE COURT//

Sd/- G.SRINIVAS REDDY
Advocate
Zahirabad

DATE: 15-02-2024
PLACE: ZAHIRABAD